క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు రానీయొద్దు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల కొరత ఉన్న విషయాన్ని గుర్తించి వెంటనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి వెళ్లి మంజూరు చేయించామన్నారు. ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య ఉన్నా వెంటనే మరమ్మతులు చేయించాలని, విద్యుత్ వైర్లు సరి చేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘు నాయక్, నర్సింహ, హరినాథ్‌రెడ్డి, చెన్నయ్య, విద్యుత్ డీఈ, ఏడీ, ఏఈలు పాల్గొన్నారు.

‘బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తుంది’

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రతిఒక్కరూ గుర్తిస్తున్నారని బీజేపీ ఓబీసీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ఎలిగని వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వాలన్నారు. మతపరమైన పది శాతం ముస్లింలకు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఎంత మంది బీసీ మంత్రులు ఉన్నారని ప్రశ్నించారు. బీసీలను మోసం చేయాలనే ఆలోచనతో ముస్లింలకు మతపరమైన 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఏంటని విమర్శించారు.


బీజేపీ కమిటీల నియామకం



శంకర్‌పల్లిలో కమిటీలను ప్రకటిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: బీజేపీ మున్సిపల్, మండల కమిటీలను శుక్రవారం ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మండలాధ్యక్షురాలు లీలావతి ప్రకటించారు. మున్సిపాలిటీ ఉపాధ్యక్షులుగా రాంమోహన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీదేవి, ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, ప్రవీణ్‌లతో పాటు 26మంది సభ్యులను ఎన్నుకోగా.. మండల ఉపాధ్యక్షులుగా రఘుపతిరెడ్డి, యాదయ్య, సత్యనారాయణరెడ్డి, లావణ్య, ప్రధాన కార్యదర్శులుగా నర్సింలు, ప్రతాప్‌రెడ్డిలతో పాటు మరో 20మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహ, నాయకులు రాములు గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ ఓటమి ఖాయం’



అజీజ్‌నగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


మొయినాబాద్: అడ్డదారుల్లో అధికారం దక్కించుకోవడమే బీజేపీ నైజంగా మారిందని సీపీఎం మండల నాయకులు ప్రభుదాస్, మహేందర్ ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని తెలిసిన బీజేపీ అక్కడ అధికారాన్ని నిలుపుకోవడం కోసం ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెచ్చి సుమారు 60 లక్షలు తొలగించారన్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో బీజేపీ అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, సాయి, మున్నా, డాన్, అంజి, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తుర్కయంజాల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. తుర్కయంజాల్, ఆదిబట్ల పురపాలక సంఘాల ఉద్యోగుల మధ్య శుక్రవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను కమిషనర్లు అమరేందర్ రెడ్డి, బాలకృష్ణలు ప్రారంభించారు. ఈ పోటీలో తుర్కయంజాల్ జట్టు విజయం సాధించింది. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు.



శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల



తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడిన పైకప్పు

శిథిల భవనం.. అప్రమత్తతే ముఖ్యం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాదకరంగా పైకప్పులు
- భయాందోళనతో అధికారులు, ప్రజలు

కొత్తూరు: పట్టణాలు, మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామన్న ప్రభుత్వ మాటలు నీటి మీది రాతలుగా ఉన్నాయి. ఇప్పటికీ చాలావరకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. మరికొన్నింటికి ఏళ్లుగా మరమ్మతులు కరువై దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇంకొన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో శిథిలావస్థకు చేరిన పలు కార్యాలయాల్లో పైకప్పు పెచ్చులూడి పలువురు గాయపడుతున్నారు. కార్యాలయాల్లో పైన పొంచి ఉన్న ప్రమాదంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

పెచ్చులూడుతున్న తహసీల్ ఆఫీస్

మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం ప్రజాపాలన వ్యవస్థలో అత్యంత కీలకం. ఆయా ధ్రువీకరణ పత్రాల కోసం ప్రతిరోజు విద్యార్థులు, ప్రజలు, రైతులు కార్యాలయానికి వస్తుంటారు. దానికి తోడు పొలాల రిజిస్ట్రేషన్ల నిమిత్తం అమ్మకం, కొనుగోలుదారులు సైతం కార్యాలయానికి వరుస కడుతారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు చేసే గది, ప్రజలు వేచి ఉండే చోట పైకప్పు(స్లాబ్) నుంచి సిమెంట్ పెచ్చులు ఊడుతుంది. గతంలో ఓ విద్యార్థిపై సిమెంట్ పెచ్చులు సైతం పడిన ఘటనలున్నాయి. అయినప్పటికీ కార్యాలయం పైకప్పునకు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటు అధికారులు, ఇటు ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు పశువైద్యశాల

మండల కేంద్రంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల తాత్కాలిక మరమ్మతులు, రంగులు వేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానికంగా పశువులకు అందించే వైద్యం, ఇతర సేవలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

పండుగ సాయన్న పోరు మరువలేనిది



షాద్‌నగర్: సాయన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రజావీరుడు పండుగ సాయన్న అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. శుక్రవారం పండుగ సాయన్న జయంతిని షాద్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నయ్య మాట్లాడుతూ.. నిరుపేదలకు సహాయం చేసే వ్యక్తిగా సాయన్న పేరు సంపాదించారన్నారు. పెత్తందారుల అన్యాయాలను, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, సర్వప్‌పాషా, మధు, వాసు, నర్సింగ్‌రాజ్, జగదీశ్వర్, సత్యం పాల్గొన్నారు.

జోరుగా రాఖీల విక్రయం

అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో రాఖీలు విక్రయించేందుకు ప్రత్యేక షాపులు వెలిశాయి. అందరినీ ఆకట్టుకునేలా వివిధ ఆకారాలు, రంగులు, సైజుల్లో రాఖీలు విక్రయిస్తున్నారు. మహిళలు, యువతుల కొనుగోళ్లతో రాఖీ షాపులు సందడిగా మారాయి. డిజైన్లు, సైజులను బట్టి రాఖీల ధరలు రూ.20 నుంచి రూ.200 వరకు ఉన్నాయి. రాఖీ షాపులతోపాటు స్వీట్ షాపుల్లోనూ సందడి కనిపించింది.

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్‌రూరల్: రక్షాబంధన్ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



చేవెళ్ల: కేజీబీవీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుక

భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

కేశంపేట: రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కంట్రోల్ రూంను తహసీల్దార్ అజాంఅలీ ఏర్పాటు చేశారు. గిర్దావర్ చెన్నకేశవులు(9948044523), రికార్డు అసిస్టెంట్ జంగయ్య (9912170411) నిర్వహణ చూడనున్నారు. కాగా శనివారం సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ (7799363553), శివ జూనియర్ అసిస్టెంట్ (9398094490), ఆదివారం జూనియర్ అసిస్టెంట్ మహేశ్ (9441579527), జూనియర్ అసిస్టెంట్ జంగేష్ (9848206029)లు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

రహదారిపై మట్టి తొలగింపు

మొయినాబాద్‌రూరల్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామోహియిజుద్దీన్ అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి హిమాయత్‌నగర్ పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ చౌరస్తాలలో భారీగా వర్షం నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బందితో పాటు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశంతో కలిసి హిమాయత్‌నగర్ చౌరస్తాలోని పలు హోటల్స్ ముందు నాలాలకు నీరు వెళ్లే విధంగా జేసీబీతో మట్టిని తీయించారు. భవిష్యత్‌లో రోడ్డుపై మట్టి పోస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సంధ్యారాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమానుబంధం.. అపురూపం

నేడే రాఖీ పండుగ

షాబాద్: రాఖీ అంటే రక్షణ అని.. బంధన్ అంటే సూత్రం అని అర్థం. సోదరుడి ప్రతి అడుగు విజయం వైపు సాగాలని.. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటూ సోదరి రాఖీ కడుతుంది. దీనికి బదులు తన సోదరికి ఏ కష్టం వచ్చిన కాపాడుతానని వాగ్దానం చేసే కానుకలు అందజేయడం ఆనవాయితీ. ప్రస్తుత ఆధునిక కాలంలోనూ ఏమాత్రం ఆదరణ తగ్గకుండా రాఖీపౌర్ణమిని జరుపుకొంటున్నారు.

ఊహ తెలిసినప్పటి నుంచి



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి సుమారు 40 ఏళ్లుగా మా అన్న రాఖీ కడుతున్నాను. అన్న ఎక్కడున్నా రాఖీ పండగకు మాత్రం మాకు అందుబాటులో ఉంటారు. ఏటా క్రమం తప్పకుండా ఇంటికి వెళ్లి రాఖీ కడతాను.

– మంజుల, గృహిణి, తాళ్లపల్లి

అనిర్వచనీయం



అమ్మానాన్నల తర్వాత అంతటి ఆదరణ చూపించే తోబుట్టుల ప్రేమ అనిర్వచనీయమైనది. ఎక్కడ ఉన్నా ప్రతి సంవత్సరం అన్నదమ్ములకు సోదరీమణులు ఇంటికి వచ్చి రాఖీలు కట్టి దీవిస్తారు. ఏడాదికి ఒక్కరోజు రక్షాబంధన్ కోసం ఎన్ని పనులు ఉన్నా మానుకుంటాం. అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు అద్దం పట్టే ఈ వేడుకలను ఏటా కుటుంబ సభ్యులతో కలిసి ఇష్టంగా నిర్వహించుకుంటాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

అందరి క్షేమం కోరేది



సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరేది రాఖీ. రక్త సంబంధం చాలా గొప్పది. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా రక్షాబంధన్ నిలుస్తుంది. తల్లిదండ్రుల తర్వాత ఆడపిల్లలకు అండగా ఉండాలని ఈ పండుగ సూచిస్తుంది. ప్రతి రాఖీ పండుగకు అన్నదమ్ములకు రాఖీ కట్టడం ఇప్పటి వరకు మరిచి పోలేదు.

– సృజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, షాబాద్

తోబుట్టువులు ఉన్నారన్న ధైర్యం



నాకు తోబుట్టువులు ఉన్నారన్న ధైర్యం చిన్నప్పటి నుంచి ఉంది. అన్నాదమ్ములు మా ఇంటికి వస్తున్నాడంటే ఎంతో ఆనందం. ప్రతి ఏడాది రాఖీ పండుగ రోజు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకుంటాను. అన్నాదమ్ములు నాపై చూపే ప్రేమ నురాగాలే తమకు శ్రీరామ రక్షగా భావిస్తాను.

– శెట్టి జ్యోతి, మాజీ ఎంపీపీ షాబాద్

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి, మడికట్టు గ్రామాల్లో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ అందించే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా ఒకసారి బీజేపీకి అవకాశం కల్పిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌గౌడ్, రామస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, మాధవరెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, వెంకట్‌రెడ్డి, మానిక్యరెడ్డి, ఈశ్వర్, సిద్ధార్థ, మహేందర్‌రెడ్డి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లకు చట్టం చేయాలి

బీసీ జేఏసీ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో చట్టం చేయాలని షాద్‌నగర్ బీసీ జేఏసీ నేతలు టీజీ శ్రీనివాస్, రవీంద్రనాథ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. రాజకీయ కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 42 శాతం కల్పిస్తామని పొందుపర్చిందన్నారు. దీనికి అనుగుణంగానే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప జేసిందన్నారు. అయితే ఈ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో ఆమోదించాల్సి ఉండగా బీజేపీ నేతలు అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. బీజేపీ ద్వంద వైఖరిని అవలంబిస్తూ బీసీలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు కరుణాకర్, బాల్‌రాజ్, నర్సింలుగౌడ్, యాదగిరి, శ్రీధర్, ఎల్లోజీ, సత్యం, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ హయాంలోనే షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, మాజీ కౌన్సిలర్లు ఈగ వెంకట్ రాంరెడ్డి, బచ్చలి నర్సింహ, కానుగు అంతయ్య, ఎజాజ్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ షాద్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. గడిచిన 20 నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన పురోగతిపై చర్చించేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. అద్దెలు చెల్లించలేక పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్, రవియాదవ్, శేఖర్, కిషోర్, యాదగిరి, సలీం, రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని నిష్టతో చేపట్టారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే మహిళలు వరలక్ష్మీదేవికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మంగళగౌరీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలుచోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్ల: కొనగట్టులో అమ్మవారు



షాబాద్: శిశుమందిర్ పాఠశాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



మొయినాబాద్: పెద్దమంగళారంలో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

జోరు వర్షం.. పంటలకు నష్టం




షాద్‌నగర్: కంసాన్‌పల్లిలో వరి చేనులోకి కొట్టుకొచ్చిన ఇసుక

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షం కారణంగా వివిధ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ నిషాంత్‌కుమార్ తెలిపారు. కంసాన్‌పల్లి గ్రామంలో వరి రెండు ఎకరాలు, బూర్గులలో 4 ఎకరాల వరి, రాయికల్‌లో రెండు ఎకరాల టమాట, అన్నారంలో ఐదు ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు చెప్పారు. ఫరూఖ్‌నగర్ మండలంలో మొత్తం 9 మందికి రైతులకు సంబంధించి 14 ఎకరాల విస్తీర్ణంలో వరి, టమాట పంటలు దెబ్బతిన్నట్లు వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏఓ తెలిపారు.

దంచికొట్టిన వాన

మొయినాబాద్‌రూరల్: మండల, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి వరకు వర్షం దంచి కొట్టింది. పంట పొలాలు, వాగులు, వంకలు జల దిగ్బంధంలో ఉన్నాయి. అమ్డాపూర్ సమీపంలో గల ఈసీ వాగు తెల్లవారుజాము వరకు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో పంట పొలాల్లోకి వరద నీరు పోటెత్తింది. శుక్రవారం ఉదయం ఈసీ వాగు చుట్టు పక్కల పొలాలు నీటితో నిండిపోయాయి. చెరువులు, కుంటలు నిండడంతో రైతులు ఓవైపు హర్షం వ్యక్తం చేస్తున్నా వేసిన పంటలు మునిగిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



ఆహ్వానిస్తున్న అంజయ్యయాదవ్

నందిగామ: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్‌పార్టీ ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆరోపించారు. మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లోకి చేరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకే నమ్మకం లేకుండా పోయిందని, దీంతో స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు అశోక్, సత్యం, భూపాల్, శేఖర్, నటరాజ్, దేవేందర్ యాదవ్, మంగలి వెంకటేష్, మంగలి అశోక్, కాట్న శేఖర్ పాల్గొన్నారు.